సాక్షి తిరుపతి
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



నేడు ఘటోత్సవం

వెంకటగిరి జాతరలో ప్రధాన ఘట్టమైన ఘటోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. - 8లో



'అల్లు'కుంటున్న బంధం

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాలు గూళ్లు కట్టుకునే పనిలో నిమగ్నమయ్యాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	34	24
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఉపాధి కల్పన నైపుణ్యాల శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఏపీ ఐటీఏ ఆధ్వర్యంలో షేక్ మస్తాన్, జే.రామకృష్ణ (నంది ఫౌండేషన్ మహేంద్ర ప్రైడ్ క్లాసురూం) వారిచే విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తర్వాత భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలను పొందగలరని ప్రిన్సిపల్ డాక్టర్ బీ.రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి



ఐఐటీ ప్రాంగణంలో జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి కలిగి ఉండాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ సూచించారు. శనివారం స్వచ్ఛతహి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 2కే రన్, శ్రమదానం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐఐటీ ప్రాంగణంలోని రోడ్లు, భవనాలు, కాలువలు, పరిసరాల్లో చెత్తచేదారాలను తొలగించారు. ఆదివారం శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యార్థులతో శ్రమదానం ఉంటుందని డైరెక్టర్ చెప్పారు. ఐఐటీ తిరుపతి డీన్ వెంకయ్య, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఐఐటీ ప్రాంగణంలో చెత్త సేకరిస్తున్న విద్యార్థులు

ఆరోగ్య రక్ష..సురక్ష!

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పేదల ఆరోగ్య సంరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తోంది. కరోనా కాలం నుంచి నేటి వరకు వినూత్న పథకాలు అమలుచేస్తూ ముందుకు దూసుకుపోతోంది. ప్రస్తుతం ఇంటి వద్దే ప్రజలకు వైద్యసేవలందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా ప్రతి వ్యక్తికీ ఏడు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్సలు చేసేలా ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు అధికారులు జిల్లా వ్యాప్తంగా శనివారం వైద్యశిబిరాలు ప్రారంభించారు.

- జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య వైద్యశిబిరాలు
- మీ ఆరోగ్యం.. ప్రభుత్వానిది బాధ్యత
- మంత్రి ఆర్కే.రోజా



వడమాలపేట: ఎస్‌బీఆర్ పురం గ్రామంలో కంటి అద్దాలు అందజేస్తున్న మంత్రి ఆర్కే.రోజా



తిరుపతిలో ఆరోగ్య సమాచార బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా: రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ఆకాంక్ష అని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే.రోజా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. నగరి అర్బన్ హెల్త్ సెంటర్, వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్‌పురం విలేజ్ క్లినిక్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి రోజా ముఖ్యఅతిథిగా ప్రాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరూ నాణ్యమైన వైద్యం అందకుండా ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీని గాడినపెట్టి దాదాపు 4 వేల వ్యాధులను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చారని కొనియాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో దాదాపు 40 ఏళ్ల చరిత్రలో ఎవరూ భర్తీ చేయలేని విధంగా వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించారని తెలిపారు. ఇంటింటికీ వైద్యాన్ని అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చారని పేర్కొన్నారు.

గూడూరు నియోజకరవర్గంలో..

పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఆరుగురు స్పెషలిస్టుల ఆధ్వర్యంలో 2,036 ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. జడ్పీటీసీ ప్రిస్కిల్లా, డీఎల్‌పీవో వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ బాలసుబ్రమణ్యం, ఎంపీడీఓ సురేషబాబు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ...

శ్రీకాళహస్తి అర్బన్ హెల్త్ సెంటర్లతోపాటు ఏర్పేడు, తొట్టంబేడు మండల్లాల్లోని విలేజ్ క్లినిక్‌లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి ప్రారంభించారు. కమిషనర్ రమేష్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు వీ.కృష్ణారెడ్డి, పట్టణ యువత అధ్యక్షులు దాము పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, బీఎన్ కండ్రిగ మండలాల్లోని విలేజ్ క్లినిక్‌లలో జరిగిన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి , జెడ్పీటీసీ కోనేటి సుమంత్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో

వెంకటగిరి నియోజకవర్గంలోని పాతపేటలో నిర్వహించిన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కమిషనర్ వెంకట్రామయ్య ప్రారంభించారు. అలాగే కేజీ పల్లెలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మి పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు.

చంద్రగిరిలో

చంద్రగిరి నియోజకరవర్గంలోని ఎర్రావారిపాళెం మండలం, రామచంద్రాపురం మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో

పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఆరుమంది స్పెషలిస్టుల చేత 2,036 ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, డీఎల్‌పీఓ వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ బాలసుబ్రమణ్యం, ఎంపీడీఓ సురేషబాబు పాల్గొన్నారు.

జిల్లాలో వైద్య శిబిరాల వివరాలు	
అర్బన్ హెల్త్ సెంటర్లు	4
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	13
వైద్య పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య	7,274



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది



తిరుపతిలో విద్యార్థులకు కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

సద్వినియోగం చేసుకోండి

జగనన్న సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిపలుపునిచ్చారు. తిరుపతి నగరం ఎంఆర్‌పల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన కమిషనర్ హరితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కేస్‌షీట్‌ను వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలకు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఆరుగురు వైద్య నిపుణుల ద్వారా వైద్య సేవలను అందిస్తున్నట్టు వెల్లడించారు. ఏడు రకాల వైద్య పరీక్షలను నిర్వహించి వాటి రిపోర్ట్ ఆధారంగా వైద్య సేవలు అందజేయనున్నట్టు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్‌రెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, కార్పొరేటర్ ఆరణి సంధ్య, పాల్గొన్నారు.



కళ్లను పరీక్షించుకుంటున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం

కమిటీ నియామకం

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా డాక్టర్ల విభాగం కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కే.రమేష్ (చంద్రగిరి), ప్రధాన కార్యదర్శులుగా ముప్పాల శంకరయ్య (శ్రీకాళహస్తి), బద్రినవీన్ (వెంకటగిరి), ఎత్తిరాజులు(సత్యవేడు), కార్యదర్శులుగా మందాటి పెంచులయ్య (వెంకటగిరి), బీ.రమేష్ (వెంకటగిరి), ఏ.జబ్బార్ (సత్యవేడు), టీఎన్.శరత్‌కుమార్ (సత్యవేడు), సుదర్శన్‌రెడ్డి (శ్రీకాళహస్తి), సంయుక్త కార్యదర్శులుగా ఎన్.నరసింహులు (వెంకటగిరి), కందుకూరు మస్తాన్‌బాబు (వెంకటగిరి), ఆర్.ఉదయ్‌కుమార్ (సత్యవేడు), బీ.సుజన(సత్యవేడు) నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

లక్ష్యాన్ని నిర్దేశిస్తూ..వ్యూహాలకు పదునుపెడుతూ!

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం విజయవంతం
- రెండు రోజుల పాటు సమాలోచనలు, వ్యూహాలు
- ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, తిరుపతి: రాబోయే 2024 ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యంపై సమాలోచనలు చేశారు. నేతలు, కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం నింపారు. రెండు రోజుల పాటు తిరుపతి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశాలు విజయవంతమయ్యాయి. తిరుపతి కేంద్రంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోవర్గాలకు సంబంధించి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. 2024లో ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, అభిమానులు విలువైన సూచనలు, సలహాలు అందించారని ఎంపీ విజయసాయిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకుల్లో ఎక్కడా నిరుత్సాహం లేదని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశాల్లో తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షులు నేదురమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, మేరిగ మురళీధర్, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, తిరుపతి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరను ప్రభుత్వ పండుగగా ప్రకటించిన నేపథ్యంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి నేదురమల్లి రాంకుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అందరూ జాతరకు రావాలని ఆహ్వానించారు.



దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి అంజలి ఘటిస్తున్న విజయసాయిరెడ్డి, పార్టీ నేతలు

3 నుంచి శాసనసభా కమిటీ పర్యటన

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు వెనుకబడిన తరగతుల శాసన సభా కమిటీ చైర్మన్ రమేష్‌యాదవ్ నేతృత్వంలో సభ్యులు పర్యటిస్తారని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 4న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం 4.30 గంటలకు తిరుపతితోపాటు సమీప ప్రాంతాల్లోని బీసీ హాస్టళ్లను పరిశీలించనున్నట్టు ఆయన వెల్లడించారు.

10 నుంచి ప్రసన్న వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: అప్పలాయిగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 9వ తేదీ సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. యాత్రికులు, భక్తులు, సిబ్బంది కారణంగా తెలియక జరిగిన దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రాకుండా నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తొలి రోజు 10వ తేదీన పవిత్ర ప్రతిష్ఠ, 11న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతారు. చివరి రోజు 12వ తేదీ మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహిస్తారు. ఈ క్రమంలో ప్రతి రోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపడతారు.

ఎస్వీయూలో చిరుత సంచారం

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిస్ క్వార్టర్స్ సమీపంలో శనివారం తెల్లవారుజామున చిరుత సంచరించినట్లు సీసీ ఫుటేజ్‌లో విజువల్స్ రికార్డు అయ్యాయి. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో చిరుత సంచరించినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా బోన్లు ఏర్పాటు చేయాలని వారు వర్సిటీ, అటవీశాఖ అధికారులకు విన్నవించారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ ఎస్వీయూ పరిధిలో చిరుత సంచరించినట్లు తెలిసిందని, ఈ మేరకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అల్లుకుంటున్న బంధం





కడప చెట్లుపై విడిది చేస్తున్న నత్తగుల్లకొంగలు, (ఇన్‌సెట్) గూడు కట్టుకునేందుకు పుల్లను తీసుకువెళ్తున్న పెద్దనీటికాకి

- జత కట్టే పనిలో నత్తగుల్లకొంగలు
- నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో మొదలైన సందర్శకుల తాకిడి

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. ఇప్పటికే ఇక్కడకు చేరిన కొన్ని రకాల పక్షులు గూళ్లు కట్టుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అవసరమైన పుల్లలు సేకరిస్తూ పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. మరికొన్ని తోడు కోసం వేతుకులాట ప్రారంభించాయి. ఇంకొన్ని కడప చెట్లపై గూడు అల్లుకుని సహజీవనం చేస్తున్నాయి. సీజన్ ముందే ఇక్కడ విడిది చేసేందుకు వచ్చిన నత్తగుల్ల కొంగలు జతకట్టేందుకు విరహవేదనతో తహతహలాడుతూ కనిపిస్తున్నాయి. నేటి నుంచి సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన సందర్శకులు, కొందరు విద్యార్థులు కేంద్రాన్ని సందర్శించారు. విడిది చేస్తున్న నత్తగుల్లకొంగలు, నీటికాకులు, స్వాతికొంగలను తిలకించి పరవశించారు. ప్రసిద్ధి చెందిన గూడబాతులు, తెల్లకంకణాలు, తెడ్డుముక్కుకొంగలు తదితరవి ఇంకా రాలేదని ఫారెస్టు సిబ్బంది తెలిపారు.

ప్రకృతిని కాపాడుకోవాలి

ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉంది. పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే తొలుత ప్లాస్టిక్‌ను నియంత్రించాలి. అప్పుడే సహసిద్ధమైన చెరువులు, కొలనులు కలుషితం కాకుండా ఉంటాయి. అదేవిధంగా ప్రకృతి అందాలైన వలస పక్షులను, అడువులు, జంతువులు వంటి వాటికి కూడా రక్షించుకుంటే పర్యావరణ దెబ్బతిందు.

– శామ్యూల్, డీఎఫ్ఓ, సూళ్లూరుపేట

నేడే చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళనం

- పసందైన వంటకాలతో విందు
- హాజరు కానున్న 16 వేల మంది నాయకులు, కార్యకర్తలు
- లక్ష చదరపు అడుగుల్లో జర్మన్ షెడ్లు
- 9 ఎకరాల మైదానంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు
- నియోజకవర్గ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఆహ్వానం

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గంలోని పార్టీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో అక్టోబర్ 1వ తేదీ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి పక్కను తనపల్లె రోడ్డులో తాజ్‌హోటల్ సమీపంలోని రామానాయుడు కల్యాణ మండలంలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆత్మీయ విందు సమావేశం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.954కోట్లతో అనేక రకాలుగా 5,020 అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలియజేశారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ అన్న తేడా లేకుండా అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని పార్టీ నేతలు, కార్యకర్తలందరి సహకారంతో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయగలిగామనీ, చేసిన మేలు జనం ముందుకు తీసుకు వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కావున ప్రతి పల్లె నుంచి పార్టీ కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

భారీ ఏర్పాట్లు

ఈ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ, ప్రతి పల్లె నుంచి 16 వేల మంది నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసి భారీ ఏర్పాట్లు చేపట్టారు. 9 ఎకరాల మైదానంలో లక్ష చదరపు అడుగుల్లో జర్మన్ షెడ్లు నిర్మించారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా పచ్చని తోరణాలు అలంకరించారు. కార్యక్రమం వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నారు. సమ్మేళనంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొననున్న నేపథ్యంలో వారి కోసం అన్ని రకాల పసందైన శాఖాహార, మాంసాహార వంటకాలు సిద్ధం చేస్తున్నారు.

మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి

తిరుపతి రూరల్: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలం, తనపల్లి రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు, గడపగడపకు మనప్రభుత్వం జరుగుతున్న తీరు, పార్టీ కార్యకర్తల మనోభావాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి మోహిత్ ను చూస్తున్నానని, మంచి వ్యక్తిత్వం, పది మందికీ సేవచేయాలన్న తపన, ఆపదలో ఆదుకునే గుణం, పెద్దలంటే గౌరవం, పేదల పట్ల ఆప్యాయత వంటి లక్షణాలతో చక్కగా పెరిగారన్నారు. తండ్రికి తగ్గ తనయునిగా రాజకీయాల్లో మంచి పేరు తెచ్చుకుంటారన్న నమ్మకం తనకు ఉందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



విజయసాయిరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు

నేడు వెంకటగిరి జాతర
ఘటోత్సవం



అమ్మవారి కుమ్మరింట ఆలయం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి జాతరలో ప్రధాన ఘట్టం ఘటోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ప్రధానంగా ఘటోత్సవంలో అమ్మవారికి బలిచ్చే దున్నపోతును, ఘటం కుండలను ప్రతి ఇంటా తిప్పుతారు. ఆపై గాలిగంగుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జీనుగుల వారి వీధికి విచ్చేస్తారు. అక్కడ దున్నపోతుకు ప్రత్యేక పూజలు చేసి పోలేరమ్మతల్లి ఆలయం వద్దకు తీసుకొస్తారు.

సంప్రదాయానికి పెద్దపీట

జాతరకు ముందు తొలుత వెంకటగిరిరాజా ప్యాలెస్‌లో తొలిపూజ.. తర్వాత తాటిపత్రియుల ఇంట మలిపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ తర్వాత అమ్మవారి పుట్టినిల్లు కుమ్మరింట, మెట్టినిల్లు జీనుగులవారి వీధి, తర్వాత పట్టణంలోని ప్రతి ఇంటికీ ఘటోత్సవ కుండలు తిరగడం సంప్రదాయద్ధంగా నిర్వహిస్తారు. ఇది గత కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆచారం.

భారీ ఏర్పాట్లు

పోలేరమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర పండుగ హోదాలో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్న జాతరకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన కుమ్మరింట, మెట్టినిల్లు జీనుగులవారి వీధి, అమ్మవారి ఆలయం, ఆర్చి తదితర ప్రదేశాలు రంగులతో ముస్తాబు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విద్యుద్దీపాలంకరణలు శోభాయమానకంగా ఆకట్టుకుంటున్నాయి.

స్విమ్మింగ్, కరాటే జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన చిత్తూరు జిల్లా స్విమ్మింగ్ బాలబాలికల జిల్లా జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో స్విమ్మింగ్, కరాటే అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి స్విమ్మర్లు హాజరయ్యారు. వీరికి జిల్లా చీఫ్ కోచ్ సయ్యద్, కోచ్‌లు ఆది, ప్రకాష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. అలాగే లింగేశ్వర్‌నగర్‌లోని కరాటే కోచింగ్ సెంటర్లో కోచ్‌లు రత్నాకర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ చంద్రశేఖర్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను బాలబాలికల జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున పాల్గొంటాయని కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

తిరుపతి రూరల్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఓ వలస కార్మికుడి ప్రాణాలు తీసింది. ఈ సంఘటన గురువారం సాయంత్రం తిరుపతికి సమీపంలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై తిరుపతి రూరల్ ఎస్ఐ మూర్తి తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ శ్రీనివాసులు ఒడిశా రాష్ట్రానికి చెందిన చిన్నారెడ్డి(47)తో పాటు మరో 24 మంది కార్మికులను బిల్డింగ్ పనుల కోసం తిరుపతికి తీసుకువచ్చారు. తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లిలో జరుగుతున్న ఓ అపార్ట్‌మెంట్‌లో గత కొన్ని రోజులుగా ఎనిమిదో అంతస్తు పనులు చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం ప్రమాదవశాత్తు ఎనిమిదో అంతస్తు నుంచి చిన్నారెడ్డి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కమిటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు ఆపార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వారిలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురికి చోటు లభించింది. వారిలో ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు జిల్లాకు చెందిన డాక్టర్ నారాయణ రెడ్డి నియమితులయ్యారు. కార్యదర్శులుగా తిరుపతి జిల్లాకు చెందిన డాక్టర్ సి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రగణేష్‌రెడ్డి, డాక్టర్ పాలూరి మహేంద్రరెడ్డి, డాక్టర్ జల్లి వరప్రసాద్, డాక్టర్ పాలూరి రాజేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా తిరుపతి జిల్లాకు చెందిన డాక్టర్ టీబీ ఆనందప్రసాద్‌రెడ్డిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలేరమ్మతల్లి జాతరకు ఆహ్వానం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగ హోదాలో నిర్వహించనున్న నేపథ్యంలో జారకు వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఆహ్వానించారు.



తిరుపతి ఎంపీ గురుమూర్తికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి